క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షుల నియామకం

అమలాపురం టౌన్: జిల్లాలోని రెండు మున్సిపాలిటీలు (పట్టణ), ఎనిమిది మండలాలకు వైఎస్సార్ సీపీ అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం సమాచారం పంపించింది. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఈ నియామకాలు జరిగాయి. అమలాపురం పట్టణ పార్టీ అధ్యక్షుడిగా సంసాని చంద్ర శేఖర్ (బులినాని), రామచంద్రపురం పట్టణ పార్టీ అధ్యక్షుడిగా గాదెంశెట్టి శ్రీధర్ నియమితులయ్యారు. మలికిపురం మండల పార్టీ అధ్యక్షుడిగా అడబాల వీర బ్రహ్మాజీరావు, మామిడికుదురు మండల పార్టీ అధ్యక్షుడిగా బొలిశెట్టి భగవాన్, రాజోలు మండల పార్టీ అధ్యక్షుడిగా కట్టా శ్రీనివాసరావు, సఖినేటిపల్లి మండల పార్టీ అధ్యక్షుడిగా కుసుమ చంద్రశేఖర్, అల్లవరం మండల పార్టీ అధ్యక్షుడిగా కొనుకు బాపూజీ, ఉప్పలగుప్తం మండల పార్టీ అధ్యక్షుడిగా బద్రి వెంకట వేమన యోగీశ్వరరావు (బాబ్జి), కాజులూరు మండల పార్టీ అధ్యక్షుడిగా పిల్లి కృష్ణమూర్తి, కె.గంగవరం మండల పార్టీ అధ్యక్షుడిగా పెట్టా శ్రీనివాసరావులు నియమితులయ్యారు. అమలాపురం, రాజోలు, రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన పట్టణ, మండల పార్టీల అధ్యక్షులను ఈ ఆదేశాలతో తాజాగా నియమించారు.

అమలాపురంలో నేడు లోక్ అదాలత్

అమలాపురం టౌన్: మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కోర్టుల్లో నేషనల్ లోక్ అదాలత్ శనివారం నిర్వహించనున్నారు. లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, రెండో అదనపు కోర్టు జిల్లా న్యాయమూర్తి వి.నరేష్ ఈ విషయాన్ని వెల్లడించారు. వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, బ్యాంక్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రాజీ పడతగ్గ క్రిమినల్ కేసులను ఈ అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అదాలత్‌లో అధిక సంఖ్యలో పాల్గొని తమ కేసులను పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి నరేష్ తెలిపారు. న్యాయవాదులు, పోలీస్ అధికారులు, బ్యాంక్, రెవెన్యూ అధికారులు అదాలత్‌లో పాల్గొని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే దిశగా సహకరించాలని న్యాయమూర్తి నరేష్ సూచించారు.

జాబ్‌మేళాలో 36 మందికి ఉద్యోగాలు

అమలాపురం రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వికాస ఆధ్వర్యంలో మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పన దిశగా కలెక్టరేట్ వికాస కార్యాలయంలో శుక్రవారం జాబ్ మేళాలో నిర్వహించారు. ఫాక్స్‌కాన్ ఐఫోన్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీకి 28 మంది, ఇసుజు మోటార్స్ కంపెనీకి ఎనిమిది మంది ఎంపికయ్యారని వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి 120 మంది నిరుద్యోగులు పాల్గొనగా వీరిలో 36 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరందరికీ జేసీ టీ నిషాంతి చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందజేశారు.

కొలిక్కిరాని ఆభరణాల అప్పగింత

యానాం: యానాంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీ సహిత రాజరాజేశ్వరస్వామి, పోలేరమ్మ, మహాలక్ష్మమ్మ, పిల్లారాయ ఆలయాలకు సంబంధించి ఆభరణాలు, వెండి తదితర నగలు అప్పగింతకు సంబంధించిన ప్రక్రియ శుక్రవారం పూర్తి కాలేదు. స్థానిక పిల్లారాయ ఆలయంలో టెంపుల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జ్యోతి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నలుగురు ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో ఆలయాలకు సంబంధించిన పాత రికార్డులు, లీజు పత్రాల పరిశీలన కొనసాగించారు. బంగారు, వెండి ఆభరణాలు అప్పగింత ప్రక్రియ సోమవారం కొనసాగనుంది.

అన్ని రంగాల్లో రాణించాలి

యానాం: సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణసుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మదర్ థెరిస్సా ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్‌థెరిస్సా నర్సింగ్ కళాశాలలో చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన ఉషారాణి, కృష్ణకుమారి, మంగతాయారును సత్కరించారు.ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర అధికారి తిర్రి గోపి, ప్రిన్సిపాల్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

పాదరక్షల వితరణ

అల్లవరం: గుడ్ సీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేవగుప్తం పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పాదరక్షలను సంస్థ అధినేత, వైఎస్సార్‌సీపీ నాయకులు కుంచే రమణరావు శుక్రవారం అందజేశారు. సర్పంచ్ సాధనాల వెంకటరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కాశి బాలయోగి, సాధనాల శ్రీను, విక్రమ్, రత్నకుమార్, కడలి రాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగి అదృశ్యం

అల్లవరం: దేవగుప్తం పోస్టాఫీసులో విధులు నిర్వర్తిస్తున్న కుంచే జాన్ ప్రదీప్‌కుమార్ (24) శుక్రవారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని అల్లవరం పోలీసులకు ప్రదీప్‌కుమార్ సోదరుడు ఫిర్యాదు చేశారు. ప్రదీప్‌కుమార్ సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్సై హరీష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ప్రదీప్‌కుమార్ ఆచూకీ తెలిసిన వారు అల్లవరం స్టేషన్ నంబర్ 9490760764, అదృశ్యమైన యువకుడు తండ్రి వెంకటేశ్వరరావుకు 9908818885 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యం

- పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ప్రత్యేక ప్రణాళికలు అమలు
- 100 శాతం ఫలితాలపై దృష్టి
- నియోజకవర్గంలో పరీక్షలకు 3,266 మంది పది విద్యార్థుల హాజరు



ఇందుపల్లి ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతి విద్యార్థులను చదివిస్తున్న ఉపాధ్యాయురాలు

అమలాపురం రూరల్: విద్యార్థి దశలో పదో తరగతి కీలకమైంది ఉన్నత చదువులు, ఉద్యోగం, జీవితంలో ఉన్నత స్థితికి చేరాలంటే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. అందుకే పదో తరగతి విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. విద్యార్థులు కూడా మంచి మార్కులు తెచ్చుకోవాలనే పట్టుదలతోనే చదువుతున్నారు. పలు పాఠశాలలు 100 శాతం ఫలితాలు సాధించేందుకు ఆయా పాఠశాలల హెచ్ఎంలు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నారు. ప్రతి రోజు పాఠశాలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై మరింత శ్రద్ధ పెట్టి చదివిస్తున్నారు. అమలాపురం నియోజకవర్గం పరిధిలో అమలాపురం పట్టణ, అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల్లో పరిధిలో ప్రభుత్వ, గురుకుల, ప్రైవేట్, యాజమాన్యం వరిధిలో 51 ఉన్నత పాఠశాలలున్నాయి. 3,266 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారు. వీరి కోసం 19 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు.

ప్రైవేటుకు దీటుగా

మార్చి 17 నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యాధికారులు, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం జిల్లాలో మొదటిస్థానంలో నిలవాలనే లక్ష్యంతో అక్టోబర్ నుంచి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని, వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. విద్యార్థులను ప్రీపబ్లిక్ పరీక్షలు నిర్వహించి మార్కుల ఆధారంగా విద్యార్థులకు ఏ,బీ,సీ, డీ గ్రేడులు కేటాయించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ప్రణాళికతో శిక్షణ

ప్రతి సబ్జెక్టులో ప్రధానమైన పాఠాలను బాగా చదవాలి. సందేహాలుంటే ఉపాధ్యాయులతో ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలి. కష్టంగా ఉన్న సబ్జెక్టులను వేకువజామున చదివితే బాగా గుర్తుంటుంది. ఇప్పటి వరకు నిర్వహించిన సమ్మేటివ్-1, ఫార్మేటివ్ పరీక్షల్లో చేసిన తప్పులను సరిచేసుకోవాలి. కఠినమైన పదాలకు అర్థాలను నోటు పుస్తకంలో రాసుకోవాలి. ఉపాధ్యాయులు సూచించిన ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యం. ఆత్మవిశ్వాసం, ఏకాగ్రతతో చదవాలి. రాత్రి ఎక్కువ సమయం మేల్కొని చదవడంతో ఫలితం ఉండదు. దీంతో పరీక్షల సమయంలో ఎక్కువగా అలసిపోతారు. విద్యార్థులు గ్రూపుగా కలసి చదివితే ఎక్కువ విషయాలు నేర్చుకునే అవకాశం ఉంటుంది. సినిమాలు, టీవీలు, ఆటలకు పరీక్షలకు ముందు స్వస్తి పలికితే మంచిదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. తరగతిలో ప్రతిభావంతులతో కలిసి పాత ప్రశ్నాపత్రాలను సాధన చేయాలి.

మండలం	ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు	విద్యార్థులు	కేంద్రాలు
అమలాపురం	30	2,083	11
అల్లవరం	13	624	4
ఉప్పలగుప్తం	8	559	4
మొత్తం	51	3,266	19

రోజు వారీ ప్రణాళిక అమలు



జిల్లా విద్యాశాఖ ఇచ్చిన రోజు వారీ ప్రణాళికను అమలు చేస్తున్నాం. ప్రీపబ్లిక్ పరీక్షల మార్కుల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించాం. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. నూరు శాతం ఫలితాల సాధనకు తగిన ప్రణాళికను అమలు చేస్తున్నాం.

– విత్తనాల శ్రీనివాసరావు, హెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్ ఇందుపల్లి, అమలాపురం మండలం

నిరంతర పర్యవేక్షణ



పదో తరగతి ఫలితాల్లో అమలాపురం మండలం విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులతో నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎప్పటికప్పుడు స్లిప్ టెస్టులు నిర్వహిస్తూ విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం.

– గుబ్బల సూర్యప్రకాశం, ఇన్‌చార్జి డీవైఈవో, అమలాపురం

ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు



ఇందుపల్లిలో ఉన్నత పాఠశాలలో నేను పదో తరగతి చదువుతున్నాను. ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ బోధన అందిస్తున్నారు. ప్రీ పబ్లిక్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా మాకు బోధన అందిస్తున్నారు. మంచి మార్కులు సాధనకు ఈ శిక్షణ దోహదపడుతుంది. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధిస్తాను.

– చొల్లంగి సాయి లాస్య, ఇందుపల్లి, విద్యార్థిని

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి



కైట్ కళాశాలలో ఎడ్యూనెట్ ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో పాల్గొన్న విద్యార్థులు

తాళ్లరేవు: విద్యార్థినీ, విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయడం ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవచ్చని ఇండ్యూబేషన్ సెంటర్ సలహాదారుడు, జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ డాక్టర్ జేవీఆర్ మూర్తి అన్నారు. మైక్రోసాఫ్ట్, ఎస్ఏపీ సహకారంతో ఎడ్యూనెట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6 నెలలపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. స్థానిక కళాశాల సెమినార్ హాలులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి మూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీన్ అకడమిక్స్, వైస్ ప్రిన్సిపాల్ రామ్‌కిరణ్ మాట్లాడుతూ ఈ శిక్షణలో పలు కళాశాలల నుంచి 15 బృందాలు పాల్గొన్నాయన్నారు. కేఐఈటీ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ పోతుల వెంకటవిశ్వం పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఐశ్వర్య, ప్రిన్సిపాల్ వై.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.గోపి, భవన్నారాయణ పాల్గొన్నారు.

27 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

తాళ్లరేవు: యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్న 27 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం తెలిపారు. సుంకరపాలెం ఎక్సైజ్ చెక్‌పోస్టు ఎస్సై కె.కృష్ణ కుమార్ తెలిపిన వివరాల మేరకు ద్విచక్ర వాహనంపై మద్యం సీసాలు తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు.

అందుబాటు ధరలో జనరిక్ మందులు

అమలాపురం టౌన్: ప్రధాన మంత్రి జన ఔషధ జనరిక్ మందుల షాపుల్లో దాదాపు 50 నుంచి 90 శాతం తక్కువ ధరలకే నాణ్యమైన మందులు లభిస్తున్న దృష్ట్యా వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ప్రధాన మంత్రి జన ఔషధ కేంద్రాల 7వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆర్థిక భారంతో మందులు కొనుగోలు చేయలేని పేద వర్గాలకు ఈ జనరిక్ మందుల షాపులతో చాలా వరకూ ఆర్థిక భారం తీరుతుందని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర పేర్కొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా ఏరియా ఆస్పత్రిలోని రోగులకు ఔషధాలను ముఖ్య అతిథులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (అముడా) చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రూపేష్, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు అధికారి వెంకట జయలక్ష్మి, మట్టా మహాలక్ష్మి ప్రభాకరావు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపుపై ఫిర్యాదు

తాళ్లరేవు: తాళ్లరేవు, కోరంగి పంచాయతీల్లో యథేచ్ఛగా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. పట్టపగలే మట్టి అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఆత్రేయ గోదావరి గట్టును తవ్వి పలువురు మట్టిని తరలిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు కాదా గోవిందకుమార్, సంగాని దాసు తదితరులు ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులకు ఫిర్యాదు చేసారు. ఈ నేపథ్యంలో అధికారులు వచ్చి మట్టి తరలింపును నిలిపివేసి నిఘా పెట్టారు. కోరంగి పంచాయతీ సీతారామపురం దంప ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుమారు 700 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని, ఆ ప్రాంతంలో ఏటిగట్టు మట్టి తీసివేస్తే ఆటుపోట్ల సమయంలో కాలనీలోకి నీరు చేరి ముంపునకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు.

చేతి వృత్తిదారులకు చేదోడుగా విశ్వకర్మ యోజన

అమలాపురం టౌన్: ప్రధాన మంత్రి విశ్వ కర్మ యోజన చేతి వృత్తుల వారికి ఆర్థిక చేదోడుగా ఆదుకుంటుందని జిల్లాలో ఈ యోజన శిక్షణ తరగతుల ప్రత్యేక అధికారి, జిల్లా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జనగం చంద్రమౌళి అన్నారు. స్థానిక ఏలీమ్ ఐటీఐ కాలేజీలో ప్రధాన మంత్రి విశ్వ కర్మ యోజనపై చేతి వృత్తిదారులకు శుక్రవారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో చంద్రమౌళి మాట్లాడారు. జిల్లా కార్పెంటర్ చేతి వృత్తుల సేవా సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణ మూర్తి హాజరయ్యారు. చంద్రమౌళితో పాటు జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, సీడీఎం కేశవవర్మ పాల్గొని ప్రధానమంత్రి విశ్వ కర్మ యోజనపై చేతి వృత్తిదారులకు అవగాహన కల్పించారు. విశ్వ కర్మ యోజనలో 18 రకాల అర్హులైన అభ్యర్థులకు శిక్షణ ఇచ్చారు. చిన్న తరహా పరిశ్రమల మాదిరిగా ఈ పథకం ఉపయోగపడుతుందని ఆయన వివరించారు.



శిక్షణ తరగుతుల్లో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి చంద్రమౌళి

చైర్‌పర్సన్, కౌన్సిలర్లకు సత్కారం



మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణిని సత్కరిస్తున్న మున్సిపాలిటీ మహిళా ఉద్యోగులు, మహిళా కౌన్సిలర్లు

అమలాపురం టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులు దినోత్సవ వేడుకలను శుక్రవారం రాత్రి జరుపుకున్నారు. ఈ వేడుకలకు మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మున్సిపల్ రెవెన్యూ అధికారిణి భూపతి శ్రీలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకల్లో చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి, మహిళా కౌన్సిలర్లు సుంకర పార్వతి, పడాల శ్రీదేవి, పిండి అమరావతి, గండి దేవి హారిక, గొలకోటి విజయలక్ష్మి, కొల్లాటి దుర్గాబాయిని మున్సిపాలిటీ మహిళా ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే మహిళా ఉద్యోగులతో పాటు 15 వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా సెక్రటరీలు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సిబ్బంది ఈ వేడుకల్లో పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, కార్యాలయంలోని పలు శాఖల అధికారులు, మహిళా ఉద్యోగులకు, మహిళా కౌన్సిలర్లకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ట్రైనీ డీఎస్పీకి సత్కారం

అమలాపురం రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బీవీసీ భట్లపాలెం క్యాంపస్‌లో ఘనంగా నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మహిళా విద్యార్థులు సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థినులు, ఉద్యోగులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థినులు సావిత్రి పూలె జీవితాన్ని నాటిక రూపంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తిని మహిళ అధ్యాపకులు, విద్యార్థినులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నల్ ఉమెన్స్ వెల్ఫేర్ సెల్ సభ్యులు ఎంసీఎస్ పద్మ, ఎన్.సుష్మ, బీ పద్మశ్రీ, బీ.కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ ఎంసీఎస్ మదన్, ఏవో జక్కం కృష్ణారావు, సీఎస్ రాజగోపాల్ అధ్యాపకులు, విద్యార్థునులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల నిలిపివేతపై నిరసన

యానాం: యానాం పట్టణ పరిధిలో వారం రోజులుగా పారిశుధ్య పనులు నిలివేతతో తలెత్తిన అపరిశుభ్రత, దుర్గంధం, అనారోగ్య సమస్యలపై స్థానిక బ్లాక్ కాంగ్రెస్, విదుతలై చిరుతైగల్ కచ్చి పార్టీలు, సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్ఏవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనకాలపేట డంపింగ్‌యార్డు మూసివేత నేపథ్యంలో దాని స్థానంలో చెత్త వేయడానికి ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపించాల్సిన బాధ్యత అధికారులు, ప్రభుత్వంపై ఉందన్నారు. పారిశుధ్య పనులు నిలిపివేయడం తగదని వారన్నారు. నాయకుడు కాటంశెట్టి రామ్మూర్తి మాట్లాడుతూ డంపింగ్ యార్డుకు కొత్తగా స్థల సేకరణ ఆలస్యమవుతున్నందున తనకు గల రెండెకరాల భూమిలో తాత్కాలికంగా రెండు నెలల పాటు చెత్త వేసుకోవడానికి ఉపయోగించుకోవాలని ప్రకటించారు. అనంతరం ఆర్ఏఓ మునిస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్దాని దినేష్, నాయకులు కాటంశెట్టి రామ్మూర్తి, చెక్కల అరుణ్, విదుతలై చిరుతైగల్ కచ్చి పార్టీ నేత మెల్లం శ్రీను, సీఐటీయూ అధ్యక్షుడు జి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



మహిళా దినోత్సవం, చైతన్యంపై చర్చించుకుంటున్న మహిళలు



ఖాతాదారులకు లక్‌పతి దీదీ రుణ పుస్తకాలను అందిస్తున్న మేనేజర్ శ్రీనివాసరాజు, ఏపీఎం సయ్యద్

అల్లవరం: ప్రతి మహిళా చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని తద్వారా ఆర్థిక పరిపుష్టి సాధించాలని, మహిళలు ఆర్థిక క్రమశిక్షణ కలిగి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఏపీఎం సయ్యద్ అన్నారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌లో మేనేజర్ వి.శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు శుక్రవారం నిర్వహించారు. తిలక్‌పతి దీదీ రుణ మేళా పథకం ద్వారా బ్యాంక్ పరిధిలోని దేవగుప్తం, సామంతకుర్రు, ఎంట్రుకోన, డి.రావులపాలెం, గుండెపూడి గ్రామాల్లోని 40 మంది మహిళలకు రూ.లక్ష చొప్పున రుణాలను మంజూరు చేశామని బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరాజు తెలిపారు. బ్యాంకు నుంచి రుణాలు తీసుకున్న మహిళలు వ్యాపారాలు, చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పాలన్నారు. బ్యాంకు నుంచి తీసుకున్న అప్పులను సకాలంలో చెల్లించి బ్యాంక్‌కు సహకరించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను ఆర్థికంగా ప్రోత్సహిస్తుందని ఏపీఎం సయ్యద్ అన్నారు. మహిళలు ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. అనంతరం 40 మహిళలకు రుణ ఖాతాలను మేనేజర్ శ్రీనివాసరాజు, ఏపీఎం సయ్యద్ అందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు దినేష్, సీతారామకుమర్, ఎం వెంకటేష్, కాంద్రేగుల వీరబాబు, వెలుగు సిబ్బంది పళ్లాలమ్మ, సుబ్బలక్ష్మీ, భారతి, సాయిలక్ష్మీ, జ్యోతి పాల్గొన్నారు.

మహిళలకు వక్తృత్వ, ఆటల పోటీలు

అమలాపురం టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్, కోనసీమ మహిళా మండలి, సంస్కార భారతి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక మహిళా మండలి భవనంలో మహిళలకు పలు అంశాలపై శుక్రవారం పోటీలు నిర్వహించారు. రాణి అహల్య బాయి హోల్కర్ రాణి దుర్గావతి జీవిత చరిత్రపై మహిళలకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నూలు సూర్య లక్ష్మి (ప్రథమ), బచ్చు పార్వతి (ద్వితీయ), నూలు వరలక్ష్మి (తృతీయ) బహుమతులు గెలుచుకున్నారు. తొలుత కోనసీమ మహిళా మండలి భవనం ప్రాంగణంలో మహిళలకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం, మహిళా చైతన్యం ఆవశ్యకతపై ఇష్టాగోష్టిగా చర్చించుకున్నారు. మహిళా మండలి, మహిళా వాకర్స్ క్లబ్, సంస్కార భారతి ప్రతినిధులు పోలిశెట్టి అనంత లక్ష్మీదేవి, వై.రామలక్ష్మి, గోటేటి లక్ష్మి, వి.సాయిలక్ష్మి, వై.రామతులసి, ఎస్.సరస్వతి, బి.పద్మావతి, పి.లలిత, కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.



పీటీఎం సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లోని మహిళలకు సత్కారం

మహిళలపై దాడులు అమానుషం

ఐ.పోలవరం: మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు చేస్తున్నా, ఎంతగా రక్షణ కల్పిస్తున్నా వారిపై దాడుల జరుగుతూనే ఉన్నాయని, కాలానికి అనుగుణంగా ఎన్ని పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నా అదేస్థాయిలో దాడులు పెరుగుతున్నాయని ప్రముఖ ఫెమినిస్ట్, సాహితీవేత్త శెట్టిబత్తుల ఎలిజిబెత్ రాణి విచారం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాల సందర్భంగా రెండు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా తొలి రోజు శుక్రవారం ఐ.పోలవరంలో నిర్వహించిన సభకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పీటీఎం సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎ.నాగలక్ష్మి, మీనాక్షిని నారీ శిరోమణి అవార్డులతో సత్కరించారు. మహిళా దినోత్సవంపై పలు సాంస్కృతిక, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విత్తనాల వరప్రసాద్ రావు, ఏఎస్ఎస్ఎన్ మూర్తి, ఎ.వెంకటరత్నం, పుల్లెపు సూర్యవతి, గుర్రాల అనంతలక్ష్మి, ఈపే భవాని పాల్గొన్నారు.

మహిళా చైతన్యంపై విద్యార్థినులకు పోటీలు



మహిళా విజయాలపై విద్యార్థినులకు చైతన్య చిత్రాలను చూపిస్తున్న పోలీస్ అధికారులు

అమలాపురం టౌన్: మహిళలు చేపట్టిన సాహసోపేత ఘట్టాలు, వారు పలు రంగాల్లో సాధించిన విజయాలకు సంబంధించిన చిత్రాలను పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థినులకు ప్రొజెక్టర్ల ద్వారా జిల్లా పోలీస్ శాఖ చూపించి వారిలో మహిళా చైతన్యం చిగురించేలా చేస్తోంది. సమాజంలో మహిళల భద్రత, రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీస్ అధికారులు వారికి వివరించారు. నిపుణులతో ఆత్మ రక్షణపై శిక్షణనిచ్చారు. జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి శుక్రవారం విడుదలైన ఓ ప్రకటనలో ఎస్పీ బి.కృష్ణారావు మహిళా సంరక్షణకు జిల్లా పోలీస్ శాఖ చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధుల్లో మహిళా చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత వైద్య శిబిరాలు, ఓపెన్ హౌస్‌లను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని పలు విద్యా సంస్థల్లో విద్యార్థినులకు మహిళా చైతన్యం అంశంపై వక్తృత్వ, చిత్రలేఖన, వ్యాస రచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశామని ఎస్పీ కృష్ణారావు వివరించారు.

బాబ్జీని పరామర్శించిన ఎంపీటీసీ సభ్యులు

అల్లవరం: ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొంది అమలాపురంలో విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఉండ్రు బాబ్జిని అల్లవరం అల్లవరం మండల ఎంపీటీసీల బృందం శుక్రవారం ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్యంపై ఎంపీటీసీలు ఆరా తీశారు. వైఎస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీలు పులుసుగంటి రాజేశ్వరి, మాకే కృష్ణమూర్తి, దొమ్మేటి శ్రీశాంతి భవాని, నాయకులు పులుసుగంటి ప్రసాదరావు, కర్రి శ్రీను పరామర్శించారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

ముమ్మిడివరం: ఏపీ సమగ్ర శిక్ష, ఆధ్వర్యంలో హైదరాబాద్ బసవ తారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్, స్మైల్ ట్రిన్ ఫౌండేషన్ సౌజన్యంతో శుక్రవారం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రహణం మొర్రి, గ్రహణ శూల చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. 44 మందికి ఉచితంగా స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా అపరేషన్లు చేస్తామని డాక్టర్ ముకుంద రెడ్డి తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి. సమగ్ర శిక్ష అదనపు పథక సంచాలకులు డాక్టర్ షేక్ సలీం బాషా, జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ మర్రెడ్డి వెంకటసత్యనారాయణ, ఎఫ్ఏఓ జి.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగికి సత్కారం

అమలాపురం రూరల్: అమలాపురం డిపోలో ఓపీఆర్ ఎస్ సూపర్‌వైజర్‌గా, ఎల్ఓగా, కోనసీమ జిల్లాకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్.వరహాల బాబును అధికారులు సత్కరించారు. స్వల్పకాలంలో 45 నూతన బస్సులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేయించి సకాలంలో స్పెషల్ సర్వీసులకు బస్సులను అందించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిననందుకు ఆర్టీసీ అధికారుల మన్ననలను పొందారు. ఆయన ప్రతిభను గుర్తించి ఆర్టీసీ విజయవాడ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జోన్-2 ప్రశంసా పత్రంతో పాటు,రూ.500 నగదు అవార్డు అందించారు. ఈ సందర్భంగా శుక్రవారం వరహాల బాబును జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు, డీఎం చల్లా సత్యనారాయణ మూర్తి చేతుల మీదుగా సత్కరించారు. ట్రాఫిక్ సూపర్‌వైజర్ ప్రతిమా కుమారి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 2కే మారథాన్

తాళ్లరేవు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తాళ్లరేవు ప్రాజెక్టు పరిధిలో 2కే మారథాన్, క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం స్థానిక ప్రాజెక్టు కార్యాలయం వద్ద సీడీపీఓ వంజరాన మాధవి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు దిశా నిర్దేశం చేసారు. సూపర్‌వైజర్‌లు డి.లలితా నిర్మల, సత్యనళిని, నిభావని సిబ్బంది పాల్గొన్నారు.